కేకే..శాశ్వత పోటీదారుడే

- వీకెండ్ లీడర్‌తో ఒరిగేదేమీలేదు
- ఇంకా పదిసార్లు బరిలో నిలిచిన గెలవలేడు
- ప్రజల దీవెనలతోనే కేటీఆర్ విజయం
- ఆయన కృషితోనే సిరిసిల్ల అభివృద్ధి
- పెద్దూరు బాధితుల పక్షాన పోరాడింది రామన్నదే
- గత పాలనలోనే 90శాతం తొమ్మిదో ప్యాకేజీ పనులు పూర్తి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 1: కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి శాశ్వత పోటీదారే తప్పా..పది సార్లు బరిలో నిలిచినా ఎమ్మెల్యేగా గెలువలేరు..' అంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఎద్దేవా చేశారు. 'సిరిసిల్ల నియోజకవర్గ ప్రజల దీవెనలతోనే కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలిచారు..ఆయన నేతృత్వం లోనే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో పురోగమించింది. అని ఉద్ఘాటించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులు సిరిసిల్ల అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వీకెండ్ లీడర్‌తో ఇక్కడి ప్రజలకు ఒరిగిదేమీ లేదని విమర్శించారు. కేకే సన్నాసి కాబట్టే ప్రజలు పదే పదే ఓడిస్తున్నారని చురకలంటించారు. ఉద్యమ కాలంలో హైదరాబాద్‌లో ఉంటూ వకాలత్ చేసుకొనే ఆయన పదవి కోసమే కేసీఆర్ పంచనచేరాడన్నారు. ఉమ్మడి పాలనలో బీఆర్ఎస్ నాయకులు పేదల ఇండ్ల కోసం, సాగునీరు, కరెంట్ కోసం పోరాడిన సందర్భంలో కేకే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పెద్దూరు గల్ఫ్ బాధితులకు కేటీఆర్ న్యాయం చేస్తే ఓర్వలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని ఆక్షేపించారు. 90శాతం పూర్తయిన కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ పనులపై రాద్ధాంతం చేస్తున్నాడని మండిపడ్డారు. సిరిసిల్లకు దిక్సూచి వంటి నాయకుడి గురించి ఇష్టానుసారం మాట్లాడితే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. కేకేకు దమ్ముంటే మల్కపేట పనులపై మీడియాకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో అప్పర్ మానేరును నింపిన ఘనత కేటీఆర్‌కే దక్కిందని కొనియాడారు. వందల కోట్లు వెచ్చించి చెక్‌డ్యాంలు నిర్మింపజేశారన్నారు. కేసీఆర్ పాలనలో మిగిలిన అరకొర పనులకు నిధులు తెచ్చి కేకే తన ఘనతగా చెప్పుకోవడం విడ్డూరమన్నారు. నీవు తెచ్చిన రూ.5కోట్ల ఆశ చూపి నాయకులను చేర్చుకుంటున్నాడని మండిపడ్డారు. కేకే సన్నాసి కాబట్టే ఆ భాషనే మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. మరోసారి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తరిమి కొడతామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ, కేటీఆర్‌పై మహేందర్‌రెడ్డి చేసిన విమర్శలు తీవ్రంగా ఖండించారు. సిరిసిల్ల ప్రజలు గొప్పగొప్ప వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారని పేర్కొన్నారు. స్థానిక రాజకీయాల్లో ఏనాడూ దూషణల పర్వం చూడలేదన్నారు. ప్రజల అభిమానం చూరగొనలాంటే గతంలో జరిగిన అభివృద్ధి కన్నా గొప్పగా చేసి చూపించాలని హితవు పలికారు. ఏటా ఫిబ్రవరిలోనే నేత కార్మికులకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ప్రభుత్వం అందించిందని, తద్వారా నేత కార్మికులతోపాటు వస్త్ర పరిశ్రమ అనుబంధం రంగంలోని అనేక రకాల కార్మికులు లబ్ధిపొందారని చెప్పారు. కానీ కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడంలేదని విమర్శించారు. వర్కర్ టూ ఓనర్ షెడ్లు పూర్తయ్యాయని, మీకు నచ్చిన విధంగా లబ్ధిదారులను ఎంపిక చేసి కార్మికులను యజమానులుగా చేయాలని ప్రభుత్వానికి సూచించారు. నాలుగు సార్లు పోటీచేసిన నిన్ను ప్రజలు ఎందుకు ఆదరించడం లేదో ఆలోచించుకోవాలన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ, మున్సిపల్ కౌన్సిలర్ గుండ్లపల్లి రామానుజం చేసిన ఆరోపణలు అవాస్తమని కొట్టిపారేశారు. ఆయన వార్డులో ₹55 లక్షలు కేటాయించామని తెలిపారు. ఎన్నికల ముందు ₹40కోట్ల పనులకు టెండర్ పూర్తి చేశామన్నారు. విలీన గ్రామాలకు ₹16కోట్లు, పట్టణంలో ₹22కోట్లు, ₹2కోట్లు జంక్షన్ల సుందరీకరణ కోసం టెండర్ ప్రక్రియ చేపట్టనున్నామన్నారు. కాంగ్రెస్ సర్కారు తాటాకు అంతటి నిధులను రద్దు చేసి చింతాకు వంటి నిధులు కేటాయించి గొప్పలు చెప్పుకుంటున్నదని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ₹40కోట్ల టెండర్ నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పార్టీ మారాలనుకున్న సందర్భంలో తప్పుడు ఆరోపణలు చేయడం సరికాద న్నారు. మీకు తగిన గుణపాఠం చెప్పే రోజులు ముందున్నాయన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాజకీయాల్లో గౌరవంగా మాట్లాడడం నేర్చుకోవాలన్నారు. సమావేశంలో బల్దియా చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్, న్యాలకొండ రాఘవరెడ్డి, మ్యాన రవి, ఎండీ సత్తార్, గుండ్లపల్లి పూర్ణచందర్, అన్నారం శ్రీనివాస్, దార్ల సందీప్, సుంకపాక మనోజ్‌కుమార్, మునీర్, షాదబ్, సిఖిందర్, కంచర్ల రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 1: దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మిగిలిపోయిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7, 8, 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్ల కోసం ఈ నెల 22లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తెలంగాణ చౌక్, మార్చి 1: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు డీఐఈవో సీహెచ్ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో 4,174 మందికి గానూ 4,024 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

5న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, మార్చి 1: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 5న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించే హుండీ లెక్కింపులో అధికారులు పాల్గొనాలని వారు సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

వేములవాడ, మార్చి 1: పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర కార్పెంటర్స్ సేవ్స్ సొసైటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా బాగోజి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా స్తంభంపల్లి శ్రీధర్, కోశాధికారిగా వేములవాడ ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా దర్శనాల శంకరయ్య, ఉపాధ్యక్షులుగా కాసర్ల కరుణాకర్, స్తంభంపల్లి వెంకటస్వామి, గౌరవ సలహాదారుడిగా పుప్పాల దేవయ్య ఎన్నికయ్యారు. ఇక్కడ విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం, వేములవాడ మండలాధ్యక్షుడు చందనం రవీందర్,నాగభూషణం, దుర్గయ్య, శ్రీనివాస్, రామలింగం, దర్శనాల రాము, తిరుపతి ఉన్నారు.

పశువులకు టీకాలు

కోనరావుపేట, మార్చి 1: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పశు వైద్యాధికారి అంజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ధర్మారంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 215 గేదెలు, 63ఆవులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. శనివారం కొలనూర్‌గొల్లపల్లిలో పశువులకు టీకాలు వేయనున్నట్లు ఆయన చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొరెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, మార్చి 1: గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంతోపాటు తడగొండ, స్తంభంపల్లి, గుండన్నపల్లి, కోరెం, బూరుగుపల్లి గ్రామాల్లో రూ.35లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి పథంలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. బోయినపల్లిలోని ఆదర్శ పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్, తహసీల్దార్ పుష్పలత, తదితరులు ఉన్నారు.

హామీలను నిలబెట్టుకుంటాం: విప్ శ్రీనివాస్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కుండీని బహూకరిస్తున్న జిల్లా కుమ్మరి సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశం, నాయకులు

వేములవాడ, మార్చి1: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలుకుల సంఘాల అభివృద్ధి, భవనాలకు అభివృద్ధికి నిధులను ఆయన మంజూరు చేసి మాట్లాడారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం అందరూ పాటుపడ్డారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా నిధులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ మహేశ్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టరేట్, మార్చి 1: ప్రశాంత వాతావరణంలో ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతాకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్తా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లతో వీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించవద్దని, కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన రూట్లలో బస్సులు నడపాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జడ్పీసీఈవో ఉమారాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శంకరయ్యకు 'వైదికాగమ కేసరి' బిరుదు



శంకరయ్యకు బిరుదును ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

వేములవాడ టౌన్, మార్చి 1: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ విశ్రాంత స్థానాచార్యుడు గోపన్నగారి శంకరయ్యకు వైదికాగమ కేసరి బిరుదు ను హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి ప్రదానం చేశారు. రాజన్న ఆలయ స్థానాచార్యులుగా దాదాపు 30ఏండ్లు సేవలందించి, ప్రస్తుతం దేవాదాయశాఖ స్మార్త పరీక్ష విభాగ సలహాదారుడిగా, ఆలయ ఆగమ సలహామండలి సభ్యులుగా సేవలందిస్తున్న శంకరయ్యకు లక్షెట్టిపేటలో జరిగిన అతిరుద్రయాగ కార్యక్రమంలో బిరుదును పీఠాదిపతి ప్రకటించి, సన్మానించారు. ఈ సందర్భంగా శంకరయ్యకు రాజన్న ఆలయ స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్, ఉప ప్రధాన అర్చకుడు నమిలకొండ ఉమేశ్, అర్చకులు, వేదపండితులు అభినందనలు తెలిపారు.

'మహాశివరాత్రి'కి ముస్తాబు

వేములవాడ టౌన్, మార్చి 1: మహా శివరాత్రి జాతరకు రాజన్న ఆలయం ముస్తాబవుతుంది. భక్తులకోసం తాత్కాలిక పార్కింగ్ లాట్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సహాయక కేంద్రాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ సెక్టార్లు, విద్యుద్దీపాటు, శివార్చన వేదికలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఎల్లారెడ్డిపేట, మార్చి1: పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావుతో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. అలాగే బండలింగంపల్లి, సింగారంలో రూ.10లక్షలతో డ్రైనేజీ పనులు, మండల కేంద్రంలో రూ.5లక్షలతో గౌడ సంఘం శ్మశాన వాటిక పనులకు భూమిపూజ చేశారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొత్తపల్లి పద్మ ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ముస్తాబాద్, మార్చి 1: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంద బాల్‌రెడ్డి సూచించారు. కొండాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆయన అల్పాహారం అందించారు. ఇక్కడ హెచ్ఎం రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

దహన సంస్కారాలకు సాయం

సిరిసిల్ల రూరల్, మార్చి 1: తంగళ్లపల్లిలో వెంగల లక్ష్మి శుక్రవారం మృతిచెందింది. మృతిరాలికి ఎవరూ లేకపోవడంతో దహన సంస్కారాల కోసం గ్రామస్తులు ఓ చెట్టు కిందనే మృతదేహాన్ని ఉంచారు. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్ రూ.5వేలు అందించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నేత సత్తు శ్రీనివాస్‌రెడ్డి రూ.2వేలు అందించారు.

యథేచ్ఛగా మట్టి, మొరం తరలింపు

చందుర్తి, మార్చి1: తిమ్మాపూర్ శివారులోని ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి అక్రమంగా మట్టి, మొరం తరలిస్తున్నారు. ఇందు కోసం వేములవాడకు చెందిన వాహనాలను వినియోగిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లోని గుట్టలే లక్ష్యంగా రాత్రీపగలు తేడాలేకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ కాసులు దండుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారుల స్పందించి వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమమై తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పల్స్‌పోలియోకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి మూడు రోజులపాటు చిన్నారులకు చుక్కల మందు
- పూర్తయిన ఏర్పాట్లు

పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా 46,354మంది చిన్నారులకు చుక్కలమందు వేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. 62హైరిస్క్ ప్రాంతాల్లో 331మంది చిన్నారులను గుర్తించింది. అందుకు గానూ పట్టణ ప్రాంతాల్లో 132, గ్రామీణ ప్రాంతాల్లో 566బృందాలను కేటాయించింది. ఈ నెల 3న కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనుండగా, తర్వాత రెండు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. స్థానిక ఎంపీడీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఇప్పటికే పల్స్‌పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించింది.

– రాజన్న సిరిసిల్ల, మార్చి 1 (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3నుంచి 5వ తేదీ వరకు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఐదేండ్ల లోపు చిన్నారులందరికీ చుక్కల మందు వేసేలా వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టింది. రెండు రోజుల క్రితం కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి పుజారి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖలతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్, మండల పరిషత్, అంగన్‌వాడీశాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, వివిధ స్వచ్ఛంద సంస్థలను భాగస్వాముల్ని చేయాలని సూచించారు. రద్దీ గల ప్రాంతాలు, బస్టాండ్లు, వారసంతలు, చౌరస్తాల్లో పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి చిన్నారికీ చుక్కల మందు వేయించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

46,354 మంది గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా ఐదేండ్ల లోపు ఉన్న 46,354మంది చిన్నారులను అధికారులు గుర్తించారు. వీరికి చుక్కల మందు వేసేందుకు 366 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే 62హైరిస్క్ ప్రాంతాల్లో 331మంది చిన్నారులు ఉన్నారు. వీరందరికీ పోలియో చుక్కలు వేయనున్నారు. 168మంది ఏఎన్ఎంలు, 474 మంది ఆశ కార్యకర్తలు, 587మంది అంగన్‌వాడీ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. అదనంగా 14 మొబైల్ టీంలు, బహిరంగ ప్రదేశాల్లో 16 టీమ్‌లను నియమించినట్లు కలెక్టర్ అనురాగ్‌జయంతి తెలిపారు.

పిల్లలకు చుక్కల మందు వేయించాలి

ముస్తాబాద్, మార్చి 1: ఐదేండ్ల లోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో తప్పనిసరిగా వేయించాలని వైద్యులు పిలుపునిచ్చారు. పోతుగల్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి శుక్రవారం పల్స్‌పోలియోపై అవగాహన కల్పించారు. మండలంలో ఐదేండ్ల లోపు చిన్నారులు 3,221 మంది ఉన్నట్లు గుర్తించారు.

భక్తులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత
- మహాశివరాత్రి జాతరలో ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత

కలెక్టరేట్, మార్చి 1: వేములవాడలో మహా శివరాత్రి జాతరకు వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రజిత పేర్కొన్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న ఆలయం, పరిసర ప్రాంతాల్లో మెడికల్ హెల్త్ క్యాంపుల ఏర్పాటు, సిబ్బందికి విధినిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, వేములవాడలోని ఈవో కాంప్లెక్స్, అమ్మవారి కాంప్లెక్స్, శివశరణం గుడి ప్రాంగణం, లడ్డూ కౌంటర్, ప్రధాన భాగాలుగా విభజించి క్యాంపులు ఏర్పాటు చేశామని, వీటితోపాటు కోరుట్ల, జగిత్యాల, తిప్పాపూర్ బస్టాప్‌లు, నాంపెల్లిలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా శ్రీరాములు, డా నయీమా, దేవస్థాన ఇన్‌చార్జి క్యాంప్ అధికారులు డా సంపత్‌కుమార్, డా దివ్య, మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాదారుడిపై కేసు నమోదు

తెలంగాణ చౌక్, మార్చి1: నకిలీ పత్రాలు సృష్టించి అమాయక ప్రజల భూములను కబ్జా చేసిన సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి వెల్లడించారు. వేములవాడ అర్బన్ మండల పరిధిలోని తెట్టెకుంట(చంద్రగిరి) పరిధిలోని గల సర్వేనంబర్ 6లో కరీంనగర్‌కు చెందిన రేఖల బెంజిమేన్ భూమిని (126గజాలు) నకిలీ పత్రాల సృష్టించి సిరిగిరి రమేశ్ కబ్జాకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా, రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇంకా బాధితులుంటే ఫిర్యాదు చేయాలన్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 1: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. ఈ మేరకు తంగళ్లపల్లి మండల పరిషత్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విశ్వకర్మ యోజన, సమ్మర్ యాక్షన్ ప్లాన్, శానిటేషన్, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. నీటి ఎద్దడి రాకుండా గ్రామాల్లో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అరిఫ్, సూపరింటెండెంట్ విజేందర్ రెడ్డి, ఏఈ సుమన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ముదిరాజ్ కమిటీ ఎన్నిక

కోనరావుపేట, మార్చి 1: ధర్మారంలో ముదిరాజ్ యూత్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నబోయిన అభిషేక్, ఉపాధ్యక్షుడిగా పడిగె అజయ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రం సతీశ్, కార్యదర్శిగా శ్రీరాముల పరశురాములు, కార్యదర్శులుగా పిట్టల ప్రశాంత్, సలహాదారుగా శ్రీరాముల అనిల్, సభ్యులుగా మల్లవేని విజయ్, రామిడి సంజీవ్, శ్రీనివాస్, వెంకటేశ్ ఎన్నికయ్యారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలి

రుద్రంగి, మార్చి 1: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లేకుండా పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని రుద్రంగి ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహ అధికారి రవీంద్రస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ సాంఘిక, సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు.

మూడు బైక్‌లకు నిప్పు.. యువకుడి అరెస్ట్

సిరిసిల్ల రూరల్, మార్చి 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి చౌరస్తాలో గుగ్గిళ్ల అంజయ్యగౌడ్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట పార్కింగ్ చేసిన మూడు బైక్‌లకు గడ్డం సాయికృష్ణ అనే యువకుడు గురువారం రాత్రి నిప్పంటించాడు. స్థానికులు గమనించి మంటలను అర్పించారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు అక్కడి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు గడ్డం సాయికృష్ణను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

అతిథి అధ్యాపకులకు ప్రభుత్వ ఉద్యోగాలు

వేములవాడ, మార్చి 1: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో పలువురు అతిథి అధ్యాపకులు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామర్స్ విభాగం నుంచి మమత (జేఎం, డీఎల్, జేఎల్, పీజీటీ), లక్ష్మి (జేఎల్, పీజీటీ), జువ్వాలజీ విభాగం నుంచి ప్రజ్ఞా (డీఎల్, జేఎల్), దీప (జేఎల్), సౌజన్య (జేఎల్) ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

నేరాల నియంత్రణకు కృషి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఫాజుల్‌నగర్‌లో సీసీ కెమెరాలు, నాంపెల్లిగుట్టపై కమ్యూనికేషన్ రిపిటర్ ప్రారంభం

వేములవాడ రూరల్: ఫాజుల్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ రూరల్, మార్చి 1: నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో పది సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగిన సీసీ కెమెరాలతో వెంటనే తెలుసుకోవచ్చన్నారు. అలాగే జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్ తీసుకునే వారి వివరాలు అందిస్తే కౌన్సెలింగ్ నిర్వహించడడంతో పాటు వారిని సన్మార్గంలో నడిపించడానికి డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ఏదైనా సమస్య ఉంటే సఖీ సెంటర్‌ను గానీ, జిల్లా షీ టీమ్‌ను గానీ సంప్రదించాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన రాజ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. ఇక్కడ డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి ఉన్నారు.

కమ్యూనికేషన్ రిపిటర్ ప్రారంభం

వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి గుట్ట పై ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ రిపిటర్‌ను ఎస్పీ అఖిల్‌మహాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలకు కమ్యూనికేషన్ సేవలు అందించడానికి నాంపెల్లి గుట్టపై రిపిటర్‌ను ప్రారంభించామన్నారు. పోలీస్‌శాఖలో విప్లవాత్మకంగా మార్పులు వచ్చాయని, మారుమూల ప్రాంతాలకు పోలీస్ కమ్యూనికేషన్ సేవలు అందించడడానికి రిపిటర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ కరుణాకర్, కమ్యూనికేషన్ సీఐ శ్రీలత, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా నడుచుకోవాలి

వేములవాడ, మార్చి 1: పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారితో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరిపాలన సౌలభ్యం కోసం గదిని నిర్మించగా, ఆయన ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా నడుచుకోవడమే కాకుండా ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఇక్కడ ట్రైయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, కమ్యూనికేషన్స్ సీఐ శ్రీలత, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

వేములవాడ టౌన్, మార్చి 1: వేములవాడ పట్టణంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలను ఆదివారం నిర్వహించనున్నట్లు కరాటే చీఫ్ ఎంఏ మన్నాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో బైపాస్‌రోడ్డులో గల మహాలింగేశ్వర గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11గంటలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ పోటీలను ప్రారంభిస్తారని వెల్లడించారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

చందుర్తి, మార్చి1: గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని జడ్పీటీసీ నాగం కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆవరణంలో జిల్లా పరిషత్ నిధులు రూ.1.50లక్షలతో బోరు మోటర్‌కు శుక్రవారం భూమిపూజ చేశారు, ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చింత పంటి రామస్వామి, సంఘం సభ్యులు తుపాకుల రవి, జంగిలి సురేశ్, మామిడి రాములు, శంకర్, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ పిట్టల బాబు, తదితరులు ఉన్నారు.

చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

ఇల్లంతకుంట, మార్చి 1: వరిలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గాలిపెల్లిలోని రైతు వేదికలో క్లస్టర్ రైతులకు శుక్రవారం అవగాహన కల్పించామరు. ఈ సందర్భంగా కరీంనగర్ రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత మాట్లాడుతూ, చీడపీడలను సకాలంలో గుర్తించి మందులు పిచికారీ చేస్తే దిగుబడులు వస్తాయన్నారు. మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రాక్లోరైడ్ 2గ్రాములు లీటర్ నీటికి లేదా క్లోరంట్రానీలిప్రోల్ 0.3మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తెగుళ్లు ఎక్కువగా ఉంటే జింక్‌సల్ఫేట్ రెం డు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చౌడు నేలల్లో అగ్గితెగులు సోకే నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇక్కడ ఏవో సురేశ్ రెడ్డి, ఏఈవో జ్యోతి, రైతులు ఉన్నారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

ఇల్లంతకుంట, మార్చి 1: మహిళల రక్షణ కేసమే షీ టీమ్‌ను ఏర్పాటు చేశామని ఎస్ఐ ప్రమీల పేర్కొన్నారు. షీ టీమ్ ద్వారా అందిస్తున్న సేవలపై శుక్రవారం దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురయితే డయల్ 100నంబర్‌కి గానీ, 8712656425 నంబర్‌కు గానీ ఫోన చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇక్కడ కానిస్టేబుళ్లు ప్రియాంక, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

నువ్వుల సాగుపై అవగాహన

రుద్రంగి, మార్చి 1: నువ్వుల సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, వరిలో తెగుళ్ల నివారణపై ఏఈవో విజయ్ శుక్రవారం మానాలలో రైతులకు అవగాహన కల్పించారు. నువ్వుల పంటలో యాజమాన్య పద్ధతులు, రసంపీల్చు పురుగులు, ఆకుముడత, కాయతొలుచు పురుగు నివారణ, వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు ఉధృతి గురించి వివరించారు. ఇక్కడ వ్యవసాయ కళాశాల పొలాస విద్యార్థులు అఖిల, సింధూజ, అమూల్య, సుష్మప్రియాంక ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892
FLAT FOR SALE
★ప్రజ్ఞాపూర్ కరీంనగర్ హైవే ప్రక్కన తక్కువ బడ్జెట్‌లో Luxury అపార్ట్‌మెంట్‌లో Flats కలవు. Sft. 1010, బ్యాంకు లోన్ కలదు. రెడీ టు ఆక్యుపై. Ph: 9396910449.
NT-536
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194